
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 10 । జనవరి । 2024



సోమశిలలో 31.757 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 31.757 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 22 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రా)	రూ.64,350
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.5,779
3శాతం జీఎస్టీతో	రూ.5,952
నవర (8గ్రా)	రూ.47,616

గరిష్టం/కనిష్టం
29.7 /24.8

వాతావరణం

మంగళవారం గాలిలో తేమ 62 శాతం ఉంది. ఉష్ణోగ్రత సాధారణం కంటే తక్కువగా ఉంది. బుధవారం చల్లని గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

ప్రజా సంకల్ప యాత్రకు ఐదేళ్లు

• వైఎస్సార్‌సీపీ నేతల సంబరాలు



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేతలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్వహించిన ప్రజాసంకల్ప యాత్రకు ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేతలు మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. ఈ క్రమంలో నెల్లూరు నగరంలోని రాజన్న భవన్‌లో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం కేక్‌కట్ చేశారు. విద్యార్థి విభాగం నేతలు తౌఫిక్, సన్నీ, సతీష్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరి డిబార్

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలో మంగళవారం జరిగిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారిణి మధుమతి తెలిపారు. మొత్తం 686 మంది విద్యార్థులకు 615 మంది హాజరు కాగా 71 మంది గైర్హాజరయ్యారన్నారు. నెల్లూరులోని రావూస్ కళాశాలలో ఒకరు, కృష్ణ చైతన్య డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థి డిబార్ అయ్యారని తెలియజేశారు.


మీటర్ రీడర్ల జిల్లా సదస్సు రేపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : విద్యుత్ సంస్థలో పని చేస్తున్న మీటర్ రీడర్లకు సంబంధించి జిల్లా సదస్సు ఈనెల 11న నిర్వహిస్తున్నామని ఏపీ విద్యుత్ మీటర్ రీడర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హజరత్‌వలీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని సంతపేటలో ఉన్న సీపీఐ కార్యాలయంలో జరిగే సదస్సుకు జిల్లాలోని మీటర్ రీడర్లు హాజరుకావాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ కంచుకోటగా పేరొందిన నెల్లూరు జిల్లాలో పాగా వేయడానికి టీడీపీ చేస్తున్న ప్రయత్నాలు ఆది నుంచి బెడిసి కొడుతున్నాయి. పార్టీ సీనియర్లకు టికెట్ ఇస్తే ఓటమి తప్పదని, కొత్త వారికి ఇద్దామంటే అభ్యర్థులు దొరకడం లేదని అధిష్టానం తలలు పట్టుకుంటోంది. నెల్లూరు ఎంపీతో పాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థుల నియామకం ఒక సమస్య అయితే జనసేనతో పొత్తు పచ్చనేతల్లో వర్గపోరుకు దారితీస్తోంది.

తేలని అభ్యర్థుల పంచాయితీ!

టీడీపీలో గందరగోళ పరిస్థితి



- పార్టీని నమ్ముకున్న వారికి మొండిచేయి
- కొత్తవారి కోసం ఎదురుచూపులు
- గెలుపుపై నమ్మకం లేక ఎవరూ ముందుకురాని వైనం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్నప్పటికీ తెలుగుదేశం పార్టీకి పార్లమెంట్ నుంచి అసెంబ్లీ స్థానం వరకు ఎవరూ బరిలో దిగేందుకు ఆసక్తి చూపని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో నెల్లూరు పార్లమెంట్ స్థానానికి కొత్త అభ్యర్థి కోసం అధిష్టానం అన్వేషణ చేస్తోంది. 2014, 2019 ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులు ఓటమి చెందారు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఉండడంతో నెల్లూరు పార్లమెంట్ సీటుకు టీడీపీ తరఫున ఎవరు పోటీ చేసినా ఓటమి తప్పదనేది భయంతో పలాయనం చిత్తగిస్తున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో పలు నియోజకవర్గాల నుంచి కొత్త ముఖాలను బరిలోకి దింపాలని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నారు. జనసేన పొత్తులో భాగంగా ఆ పార్టీ నేతలు నెల్లూరు సిటీ ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఈ నేపథ్యంలో వారికి ప్యాకేజీ ఇచ్చి రూరల్ నియోజకవర్గం వైపు మళ్లించే ప్రయత్నాలు చేయిస్తున్నారని ఆ పార్టీ నేతలే చెబుతున్నారు. దీంతో నెల్లూరు రూరల్ తనకే అని అనుకుంటున్న వైఎస్సార్‌సీపీ బహిష్కృత ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. టికెట్ ఇస్తే టీడీపీ తరఫున... లేకుంటే ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని శ్రీధర్‌రెడ్డి నిర్ణయించుకున్నట్లు రాజకీయ వర్గాల సమాచారం.

➡ సర్వేపల్లి నుంచి పోటీ చేసేందుకు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సిద్ధంగా ఉన్నప్పటికీ వరుసగా ఐదుసార్లు ఓటమి చెందిన నేపథ్యంలో ఈసారి కొత్త వ్యక్తిని నిలబెట్టాలని టీడీపీ భావిస్తోంది. అందుకే ఇప్పటి వరకు సోమిరెడ్డి అభ్యర్థిత్వంపై స్పష్టత లేదని సమాచారం.

➡ కోవూరులో మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పొలిటికల్ రిటైర్‌మెంట్ ప్రకటించడంతో ఈ దఫా ఆయన కుమారుడు దినేష్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీకి ఉన్న బలంతో పాటు పోలంరెడ్డిపై ఉన్న వ్యతిరేకత కారణంగా ఇక్కడ కూడా కొత్త అభ్యర్థిని రంగంలోకి దింపాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

➡ కావలిలో ఇప్పటికే నలుగురు నేతలు టికెట్ అడుగుతున్నప్పటికీ వీరందరూ మండలస్థాయి నాయకులే. కొత్తగా మైనింగ్ మాఫియా డాన్ డి.వెంకటకృష్ణారెడ్డికి సీటు ఇవ్వాలనుకున్నా ఓటమి తప్పదని సర్వేల్లో తేలింది. దీనికి తోడు క్షేత్రస్థాయిలో టీడీపీ క్యాడర్ కూడా సహకరించే పరిస్థితి లేదు. దీంతో ఇక్కడి అభ్యర్థి ఎవరనేది తేలకుండా ఉంది.

➡ ఉదయగిరిలో మాజీ ఎమ్మెల్యే బొల్లినేని, ఎన్‌ఆర్‌ఐ కాకర్ల సురేష్ టికెట్ మాదే అంటూ ప్రచారం చేసుకుంటున్నారు. పనిలో పనిగా వైఎస్సార్‌సీపీ బహిష్కృత ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి కూడా టికెట్ ఆశిస్తున్నాడు. ఇక బీసీ మార్కుతో చెంచలబాబు యాదవ్ సీటు ఆశిస్తున్నాడు. మరి చంద్రబాబు బ్యాగ్ బరువున్న వ్యక్తుల వైపే చూస్తాడా? సామాజిక న్యాయం వైపు చూస్తాడా అనేది తేలాల్సి ఉంది.

➡ ఆత్మకూరు నుంచి వైఎస్సార్‌సీపీ బహిష్కృత ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డిని దింపాలని యోచిస్తున్న టీడీపీకి ఆయన బిగ్‌షాక్ ఇచ్చినట్లు తెలిసింది. ఆత్మకూరు నుంచి పోటీలో ఉండబోనని తెగేసి చెప్పినట్లు సమాచారం. ఇటీవల వరుసగా రెండు దఫాలు ఆయన సొంతంగా సర్వే నిర్వహిస్తే ప్రజాదరణ తక్కువగా ఉన్నట్లు వచ్చింది. ఈ నేపథ్యంలో ఆనం సైతం ముఖం చాటేస్తున్నట్లు తెలుస్తోంది.

➡ కందుకూరు నుంచి ఇంటూరి బ్రదర్స్ మధ్య పోటీ ఉంది. ఇందులో ఇంటూరు నాగేశ్వరరావుకు చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారనే ప్రచారం నడుస్తోంది. అయితే వైఎస్సార్‌సీపీ బలంగా ఉన్న కందుకూరులో టీడీపీ ఓటమి తప్పదని, దీంతో కొత్త వారికి టికెట్ ఇవ్వాలనే ఆలోచనతో అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది.

ఎదురు పెట్టుబడికి సిద్ధంగా అధిష్టానం

మొత్తంగా అన్ని నియోజకవర్గాల్లో పరిస్థితి ఇలా ఉండడంతో ఆ పార్టీ అధినేత తల పట్టుకున్నట్లు సమాచారం. సీట్ల కోసం డబ్బు మూటలతో వస్తారని ఆశించిన చంద్రబాబుకు పోటీ చేసేందుకు అభ్యర్థులు కరువు కావడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. అయితే సర్వేపల్లి, కోవూరు, కావలి, కందుకూరు, ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల నుంచి ఆ పార్టీకి అభ్యర్థులు ఉన్నప్పటికీ కనీసం అధికార పార్టీకి ఏ మాత్రం పోటీ ఇచ్చే స్థాయి నేతలు కాకపోవడంతో వీరి స్థానంలో కొత్త వారిని రంగంలోకి దింపాలని టీడీపీ అధినేత యోచన. ఇందుకు బడాబాబులను ఆహ్వానిస్తున్నప్పటికీ పోటీకి వారు కూడా సిద్ధంగా లేకపోవడంతో కొంచెం పెట్టుబడి మీరు పెట్టండి.. మిగతాది పార్టీ చూసుకుంటుందని హామీ ఇస్తున్నారంట. కొత్త వారు దొరక్కపోతే కోవూరు, కందుకూరు, ఉదయగిరిలో పాత వారికే టికెట్లు కేటాయించే అవకాశం ఉంది. సర్వేపల్లి, కావలి, ఆత్మకూరులో కచ్చితంగా కొత్త అభ్యర్థులు వస్తారని తెలుస్తోంది.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి చిత్రంలో డీపీఓ సుస్మితారెడ్డి

నెల్లూరు(పొగతోట) : 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి, డీపీఓ సుస్మితారెడ్డి సూచించారు. నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై వివిధ మండలాల ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలతో మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వీరు మాట్లాడారు. రాజ్యాంగంలోని 243–జీ ఆర్టికల్ ప్రకారం పంచాయతీలను స్థానిక ప్రభుత్వాలుగా గుర్తించాలన్నారు. వాటి ద్వారా ప్రజల ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయం సాధించడానికి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. మొదట పంచాయతీల్లో ప్రణాళికలు సిద్ధం చేసి దానికి అనుగుణంగా మండల, జిల్లా స్థాయిలో ప్రణాళికలు రూపొందించాల్సి ఉంటుందన్నారు. ఈనెల 31వ తేదీలోపు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వచ్చే నెల 29లోపు మండల పరిషత్‌లు, మార్చి 31లోపు జిల్లా పరిషత్ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. గ్రామ పంచాయతీలు రూపొందించే ప్రణాళికలకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ప్రణాళికలు రూపొందించే ముందు తప్పనిసరిగా గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. తొలుత మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వైభవంగా పోలేరమ్మ జాతర



గ్రామోత్సవంలో భాగంగా వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు

• అల్లూరు జాతరకు పోటెత్తిన భక్తులు

కావలి : అల్లూరు గ్రామదేవత పోలేరమ్మ జాతర మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని కరుణించమ్మా.. పోలేరమ్మా అంటూ మొక్కులు తీర్చుకున్నారు. అల్లూరులో స్వయంభువుగా వెలసిన పోలేరమ్మకు వందేళ్ల నుంచి ప్రతి సంక్రాంతికి ముందు వచ్చే మంగళవారం రోజున జాతర నిర్వహించడం ఆనవాయితీ. జాతరలో భాగంగా ఉదయం ఆరు గంటలకే అమ్మవారు బంగారు ఆభరణాలతో విశేషంగా దర్శనమిచ్చారు. ఆరున్నర గంటలకు అమ్మవారి గ్రామపూజ నిర్వహించారు. అనంతరం ఆచార సద్ది నివేదనకు భక్తులు భారీగా తరలివచ్చారు. సాయంత్రం పోతురాజు వద్ద పోలేరమ్మకు చలిపిండి, పానకాల సమర్పణకు కూడా భక్తులు భారీగా తరలివచ్చారు.



పోలేరమ్మకు సద్ది నివేదిస్తున్న మహిళలు



అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే రామిరెడ్డి

వైభవంగా గ్రామోత్సవం

గ్రామదేవత పోలేరమ్మ గ్రామోత్సవం మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా సాగింది. సాంప్రదాయాన్ని అనుసరించి కళుగోళమ్మకు పల్లకిసేవ, ముద్రగడ పావనం, వీరతాళ్లు, కత్తి ఆచార కార్యక్రమాలు, కాగడా వెలుగులు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారు గ్రామోత్సవానికి బయలుదేరారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు, చిరు వ్యాపారులు, కళాకారులతో అల్లూరు వీధులన్నీ సందడిగా మారిపోయాయి. మరోవైపు భక్తులను అలరించేందుకు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రముఖ సినీ, టీవీ గాయకుల జానపద పాటలు నృత్యాలు భక్తులను హోరెత్తించాయి. కాగా అమ్మవారిని ఎంపీ బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి దర్శించుకున్నారు.

కేన్సర్ బాధితుడికి రూ.లక్ష వితరణ

కోవూరు : మండలంలోని పడుగుపాడు గ్రామానికి చెందిన వలంటీర్ మెరీనా కుమారుడు మోక్షిత్ జాయ్ కేన్సర్‌తో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా బాధిత కుటుంబానికి రూ.లక్ష నగదును మంగళవారం పడుగుపాడులో అందజేశారు. దీంతో కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఎలక్షన్ కమిషన్ సమావేశంలో కలెక్టర్, ఎస్పీ



నెల్లూరు(దర్గామిట్ట) : ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా అధికారులు విజయవాడలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్, ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వరరెడ్డి హాజరయ్యారు. రానున్న ఎన్నికలకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు.



యూరియా నిల్వలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

1,500 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరు

ముత్తుకూరు: నెల్లూరు జిల్లాకు 1,500 మెట్రిక్ టన్నుల యూరియా మంజూరైందని వ్యవసాయశాఖ ఏడీ రాజ్‌కుమార్ తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి ఆదేశాల మేరకు మండల ఏఓ జ్యోత్స్నారాణితో కలిసి అదానీ కృష్ణపట్నం పోర్టులో యూరియా నిల్వలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎరువుల కంపెనీ కోరమాండల్ సంస్థ ప్రతినిధి నాగేశ్వరరావుతో యూరియా నిల్వలపై చర్చించారు. నౌకల ద్వారా దిగుమతి జరిగిన యూరియాలో ఇప్పటి వరకు 600 మెట్రిక్ టన్నులు జిల్లాకు కేటాయించినట్లు ఆయన ఈ సందర్భంగా వ్యవసాయాధికారులకు తెలిపారు. మరో మూడు రోజుల్లో మిగిలిన 900 మెట్రిక్ టన్నుల యూరియాను జిల్లాలోని సహకార సంఘాలకు, ఆర్బీకేలకు కేటాయిస్తామని తెలిపారు.

అభివృద్ధి జరగలేదనడం
హాస్యాస్పదం



మైపాడు రోడ్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అనిల్ కుమార్

- నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'నెల్లూరులో ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్నాయని రెండు నెలల నుంచి తిరుగుతున్న కొందరు అభివృద్ధి జరగలేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది' అని సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్ కుమార్ అన్నారు. నగరంలోని మైపాడు రోడ్డులో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం వచ్చాక మైపాడు రోడ్డును నాలుగు లేన్ల రోడ్డుగా అభివృద్ధి చేయడంతోపాటు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశామన్నారు. జాఫర్ సాహెబ్ కాలువకు రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నామన్నారు. బోడిగాడితోట వద్ద ఉన్న డంప్ యార్డును కూడా పండగల తర్వాత పూర్తిగా తొలగించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వారధి సెంటర్‌కు, అలాగే రంగనాయకుల స్వామి గుడికి వెళ్లే రైల్వే గేట్లు వద్ద అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి పండగల తర్వాత శంకుస్థాపన చేస్తామన్నారు. నగర ఎమ్మెల్యేగా తన నుంచి వ్యాపారస్తులకు ఎటువంటి బెదిరింపులు, ఇబ్బందులు లేవన్నారు. మైపాడు రోడ్డును వెడల్పు చేస్తున్న సందర్భంలో ఆంజనేయస్వామి దేవస్థాన ప్రహరీని తొలగించి.. మళ్లీ నిర్మిస్తామని చెప్పినా కొందరు తనపై విమర్శలు చేశారన్నారు. నేడు ప్రహరీని అద్భుతంగా నిర్మించామన్నారు. తన సొంత గ్రామంలో సొంత నిధులతో రామాలయాన్ని నిర్మిస్తున్నానన్నారు. తనను ఆలయాలు పడగొడుతున్నాడని మాట్లాడటం బాధాకరమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పోలంరెడ్డి లక్ష్మీప్రత్యూష, ఓబిలి రవిచంద్ర, సంక్రాంతి అశ్విని, నాయకులు పాల్గొన్నారు.



మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

పేదల గుండెల్లో సుస్థిర స్థానం

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. కోవూరు మండలం పడుగుపాడు చంద్రమౌళినగర్ గిరిజన కాలనీలో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదం సీఎం జగన్‌కు ఉందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఏ ఒక్కరూ ఫలానా పథకం కావాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అడగలేదన్నారు. ప్రజల నాడి తెలుసుకున్న సీఎం వారికి అవసరమైన పథకాలను ప్రవేశపెట్టి నేరుగా బ్యాంక్ ఖాతాల్లోనే నగదు జమ చేస్తున్నట్లు తెలిపారు. నాలుగున్నరేళ్లకు పైగా గ్రామాల వైపు కన్నెత్తి చూడని టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తిరుగుతున్నారన్నారు. ఉనికి కాపాడుకునేందుకు వస్తున్న వారిని ప్రజలు నమ్మరాదన్నారు. ఏ క్షణంలో ఎన్నికలు వచ్చినా ఎదుర్కొనేందుకు నాయకులంతా సిద్ధంగా ఉండాలన్నారు. ఇతర రాజకీయ పార్టీలు మొత్తం ఏకమై ఎన్ని కుట్రలు పన్నినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒంటరిగానే ప్రజల మద్దతుతో ఎన్నికలకు వెళ్తారన్నారు. రాబోయేది సంక్షేమ ప్రభుత్వమే అన్నారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, డీఎల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, సర్పంచ్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రూరల్ నియోజకవర్గంలో
జోరుగా పనులు



మహిళకు వైఎస్సార్‌సీపీ కండువా కప్పుతున్న ఎంపీ ఆదాల

- నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరురూరల్: రూరల్ నియోజకవర్గంలో జోరుగా అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ ఆ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. 32వ డివిజన్‌లోని ఎస్సీసీ కాలనీలో రూ.1.60 కోట్లకు సంబంధించి అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో గెలిచేందుకు చంద్రబాబు బూటకపు హామీలు ఇస్తాడని, వాటిని ప్రజలు నమ్మవద్దని కోరారు. టీడీపీ అధికారంలోకి వస్తే మాత్రం ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు ఉండవన్నారు. దేశ చరిత్రలో ఎన్నడూలేని విధంగా పెన్షన్లు మంజూరు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మళ్లీ ఆయన సీఎం అయితే పథకాలు కొనసాగుతాయన్నారు. ప్రస్తుతం రూరల్ నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం ఉందన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

32వ డివిజన్‌లోని టీడీపీ, బీజేపీ, సీపీఎం పార్టీలకు చెందిన 150 కుటుంబాలు ఎంపీ ఆదాల సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి ఆదాల, మేయర్ స్రవంతి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో సముచిత స్థానం కల్పిస్తామని వారికి ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, రైల్వే బోర్డు మెంబర్ స్వర్ణా వెంకయ్య, స్థానిక కార్పొరేటర్ అవినాష్, నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు గుణపాఠం చెప్పాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి

కావలి: 'చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ప్రజలకు మేలు చేయలేదు. సంక్షేమ పథకాలు ఎందుకంటూ ఇష్టమొచ్చినట్లు మాట్లాడాడు. వచ్చే ఎన్నికల్లో ఆయనకు ప్రజలు గుణపాఠం చెప్పాలి' అని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. కావలి రూరల్ మండలం ఆముదాలదిన్నె గ్రామంలో రెండో విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాలన చూసి మనమంతా సంతోషపడాలన్నారు. అన్ని వర్గాలు బాగుండాలంటే జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. చంద్రబాబును నమ్మితే కష్టాలు పడాల్సిందేనని చెప్పారు. వైద్య రంగంలో జగనన్న విప్లవాత్మక మార్పులను సీఎం తెచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు జంపాని రాఘవులు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కందుల శ్రీనివాసులు, నాయకుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మోసానికి మారుపేరు చంద్రబాబు


- ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి



కేక్ కట్ చేస్తున్న రాజగోపాల్‌రెడ్డి


ఉదయగిరి: 'మోసానికి మారుపేరు చంద్రబాబు. మాట తప్పని నేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ప్రజల్లో ఇదే భావన ఉంది' అని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ప్రజాసంకల్ప యాత్రకు ఐదేళ్లయిన సందర్భంగా మంగళవారం ఉదయగిరిలోని ట్యాంక్ బండ్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ పాలన చేస్తున్న ఆయనపై ఎల్లో మీడియా, టీడీపీ దుష్ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ నాయకులు చెప్పే మాటలకు మోసపోకుండా సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.ఓబుల్‌రెడ్డి, సీనియర్ నాయకుడు చేజర్ల సుబ్బారెడ్డి, ఇతర నేతలు అక్కి భాస్కర్‌రెడ్డి, బాలిబోయిన శ్రీనివాసులు, ముర్తుజా హుస్సేన్, ఉప్పుటూరి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 95
లేయర్ (లైవ్)	: 80
బ్రాయిలర్ చికెన్	: 180
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 200
లేయర్ చికెన్	: 136

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.31
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.7

శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానము

(బిలకూట క్షేత్రం)

కొండబిట్రగుంట గ్రామము, బోగోలు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

టెండరు కమ్ బహిరంగ వేలం ప్రకటన

పాట జరుగు తేది: 17-01-2024 బుధవారం   సమయం: ఉదయం.11.00 గంటల నుండి

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, బోగోలు మండలం, కొండ బిట్రగుంట గ్రామములో వేంచేసియున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవములు సందర్భముగా తేది 19.03.2024 నుండి 25.03.2024 వరకు పరిమిత కాలమునకు మరియు బ్రహ్మోత్సవముల తదుపరి సంవత్సర కాలమునకు ఈ క్రింది తెలియపరిచిన వివిధ ఐటములకు తేది 17.01.2024 బుధవారం ఉదయం 11.00 గంటల నుండి కొండ బిట్రగుంట గ్రామములో దేవస్థాన కార్యాలయం వద్ద దేవాదాయశాఖ అధికారుల సమక్షమున విడివిడిగా బహిరంగ వేలము/సీల్డు టెండరు జరుపబడును. వేలం పాటలో పాల్గొనదలచినవారు ఈ క్రింది షరతులకు లోబడి పాటలో పాల్గొనవలెను.

ఐటమ్ నెం.1: బ్రహ్మోత్సవముల సందర్భంగా వేలంపాటల వివరములు

నెం	పాట వివరములు	ధరావత్తు	సమయము	కాలపరిమితి
1	కొబ్బరికాయలు, పూజాద్రవ్యములు అమ్ముకొను హక్కు మరియు కొబ్బరి చిప్పలు పోగు చేసుకొను హక్కు	రూ. 5,00,000/-	తేది 17.01.2024 బహిరంగ వేలం ఉదయం 11.00గం॥లకు	తేది 19.03.2024 నుండి తేది 25.03.2024 వరకు
2	తల నీలాలు సేకరించుకొను హక్కు	రూ.7,00,000/-		
3	చెరుకు అమ్ముకొను హక్కు	రూ.3,00,000/-		
4	రంగులరాట్నం తిప్పుకొను హక్కు	రూ.7,00,000/-		
5	తాత్కాలిక షాపుల నుండి రుసుము దండుకొను హక్కు	రూ. 1,00,000/-		
6	పాదరక్షలు భద్రపరచుకొను హక్కు	రూ.30,000/-		

ఐటమ్ నెం.2: బ్రహ్మోత్సవముల తదుపరి కాలం వేలంపాటల వివరములు

నెం	పాట వివరములు	ధరావత్తు	సమయము	కాలపరిమితి
1	తల నీలాలు సేకరించుకొను హక్కు	రూ.7,00,000/-	తేది 17.01.2024 బహిరంగ వేలం ఉదయం 11.00గం॥లకు	తేది 26.03.2024 నుండి 2025 బ్రహ్మోత్సవముల ముందురోజు వరకు
2	కొబ్బరికాయలు, పూజాద్రవ్యములు అమ్ముకొను హక్కు	రూ.3,00,000/-		
3	కొబ్బరి చిప్పలు పోగు చేసుకొను హక్కు	రూ.2,00,000/-		
4	పాదరక్షలు భద్రపరచుకొను హక్కు	రూ. 10,000/-		

ఐటమ్ నెం.3: బ్రహ్మోత్సవముల కాలమునకు సీల్డు టెండర్లు వివరములు:

నెం	టెండరు వివరములు	ధరావత్తు	సమయము	కాలపరిమితి
1	చలువ పందిళ్ళు వేయుట, క్యూలైన్లు ఏర్పాటు తిరిగి తీసుకొనుపోవుట	రూ.50,000/-	తేది 17.01.2024 సీల్డు టెండరు మధ్యాహ్నం గం.2.00లకు	19.03.2024 నుండి 25.03.2024 వరకు
2	ఎలక్ట్రికల్ డెకరేషన్ చేయుట	రూ.50,000/-		
3	సున్నం మరియు రంగులు వేయుట(లేబర్)	రూ.10,000/-		
4	బ్రహ్మోత్సవములలో పూల అలంకరణ టెండరు	రూ.30,000/-		

ఐటమ్ నెం.4: బ్రహ్మోత్సవముల తదుపరి కాలం సీల్డు టెండర్లు వివరములు

నెం	టెండరు వివరములు	ధరావత్తు	సమయము	కాలపరిమితి
1	ఆవు పేడ సేకరించుకొనుటకు	రూ.10,000/-	తేది 17.01.2024 మధ్యాహ్నం గం.2.00లకు	01.01.2023 నుండి 31.03.2024 వరకు
2	ఫల సరుకులు సరఫరా చేయుట	రూ.20,000/-		01.04.2024 నుండి 31.03.2025 వరకు

ఐటమ్ నెం.5: స్వామి వారికి భక్తులు సమర్పించిన బియ్యం, వడ్లు స్టాకు

నెం	టెండరు వివరములు	తూకం	ధరావత్తు
1	బియ్యం స్టాకు	సుమారు 5 టన్నులు	రూ.50,000/-
2	వడ్లు స్టాకు	సుమారు 3 టన్నులు	రూ.30,000/-

వేలం పాట మరియు సీల్డు టెండర్ షరతులు

1. ఈ వేలంపాట దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆమోదపు ఉత్తర్వులకు లోబడి కార్యనిర్వహణాధికారిచే జరుపబడును. 2. ఈ వేలం పాటలను ఏ కారణము తెలుపకయే పాట వాయిదా వేయుటగాని, రద్దు చేయుటగాని, నిలుపదలకుగాని దేవస్థానం కార్యనిర్వహణాధికారి అధికారము కలదు. 3. హెచ్చుపాటదారుడు పేరిట పాట తెగిన వెంటనే ధరావత్తుతో కలిపి ఆ పాట మొత్తము చెల్లించవలెను. లేని యెడల అప్పటి వరకు కట్టిన ధరావత్తు మొత్తం వర్ఫీట్ చేసి దేవస్థానమునకు జమచేసుకొని తిరిగి పాట జరుపుటకు కార్యనిర్వహణాధికారి వారికి అధికారం కలదు. తిరిగి పాట పెట్టగా నష్టం వచ్చిన ఎడల మొదటి పాటదారుని వద్ద రాబట్టు కొను నిర్ణయము. 4. ఈ వేలం పాటలో ధరావత్తు హెచ్చించుటకుగాని తగ్గించుటకు గాని కార్యనిర్వహణాధికారికి పూర్తి అధికారము కలదు. 5. దేవస్థానంలో ఎటువంటి లావాదేవీలు ఉన్నవారు ఈ వేలంలో పాల్గొనరాదు. దేవస్థానమునకు లోగడ బకాయిలు ఉన్నవారు గాని, బకాయిదార్ల బంధువులుగాని వేలంలో పాల్గొనరాదు. 6. ఈ వేలం సరైనది కాదని భావించిన ఎడల వేలం పాటను నిలుపుదల చేయుటగాని, రద్దు చేయట గాని వాయిదా వేయుటగాని కార్యనిర్వహణాధికారి వారికి పూర్తి అధికారము కలదు.

కొండ బిట్రగుంట క్షేత్రం
తేది: 06-01-2024

చైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు

భగవదీయుడు
కార్యనిర్వహణాధికారి